# ప్లాట్‌ఫారం బ్రతుకులు

- వేలూరి కౌండిన్య



నారిగాడి కేరాఫ్ అడ్రస్ రైల్వేస్టేషన్. వాడు అక్కడకు వచ్చి ఐదేళ్లు పైనే అయింది. నారిగాడి తండ్రి కేశవ్. శ్రీకాకుళం దగ్గర ఓ పల్లెటూరు. రిక్షా తొక్కుతాడు. సవతి తల్లి రాకముందు దాకా వాడి పని బాగానే వుండేది. కేశవ్ మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. అప్పటి

నుండే నారిగాడికి బాధలు మొదలయ్యాయి. కేశవ్‌కు శారీరక అవసరాలు తీర్చే ఓ వ్యక్తి దొరికింది కానీ, వాడికి తల్లి ప్రేమ దొరకలేదు. సవతి తల్లి పెట్టే బాధలు పడలేక, తండ్రి లాలింపు లేక ఇంట్లోంచి పారిపోయి వచ్చాడు నారిగాడు అనబడే నారాయణ.

బెజవాడ రైల్వేస్టేషన్. అనాథల పాలిటి పెద్దమ్మ. ఆమె ఒడి పుష్పక విమానం. ఎందరో వీధి బాలలకు ఆమె మాతృమూర్తి. తన ప్రేమను అందరికీ పంచే ఉత్తమ ఇల్లాలు. కొన్ని వందల వేల కథల్ని, కష్టాలను, కన్నీటిని తనలో దాచుకుంది.

నారిగాడి లాంటి అనాథ పిల్లల జీవన పోరాటం తెల్లవారకముందే ప్రారంభమవుతుంది. స్టేషను మీదుగా వెళ్లే రైళ్లను పట్టుకోవడం - రెండు మూడు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయడం - రైలు బోగీలు శుభ్రం చేయడం - ప్రయాణీకుల తిట్లతోపాటు పదీవరకా సంపాదించుకోవడం వీళ్ల వృత్తి. మళ్లీ ఏ అర్ధరాత్రికో స్టేషనుకు చేరుకోవడం - ఏ ప్లాట్‌ఫారం చివరో, ఆ రోజుకు ఆగిపోయిన ఏ రైలు పెట్టెలోనో నిద్రపోవడం వీళ్ల తరువాత కార్యక్రమం. యాదగిరి, తలుపులమ్మ, నర్సింలు, ఓబులేసు, చింపిరి నారిగాడితోపాటు స్టేషన్ అంటిపెట్టుకున్న బాధాసర్పదష్టులు.

***

ఆ రోజు రైళ్లు బంద్. 'ఎక్స్' పార్టీ మినిష్టరుకు మంత్రి పదవి ఇవ్వలేదని 'వై' పార్టీ వాళ్లు రైళ్లు బంద్ చేస్తున్నారు. రైళ్ల రాకపోకలు లేక స్టేషను ప్రశాంతంగా వుంది. వెండర్సుకు బేరాలు లేక బల్లల మీద కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ రోజు నారిగాడి మిత్రబృందానికి రెస్ట్. ప్లాటుఫారం చివర కూర్చున్నారు. కడుపులో ఆకలి ఎలుకలు పరుగెడుతున్నాయి.

'ఒరే నారిగా! నీకాడ ఐదు రూపాయలు వుంటే ఇవ్వరా...' చింపిరి నీరసంగా అడిగింది. అప్పుడే బాల్యం నుండి యవ్వనంలోకి అడుగుపెడుతున్న వయస్సు ఆమెది.

నా దగ్గర ఏటున్నాయేం- నారిగాడి సమాధానం.

నిన్న నీకాడ ముప్పై రూపాయలు చూసినాను కాదేటి. పొద్దుమాలే ఏటి చేసినావురా- చింపిరి ఆరా.

సత్తె పెమాణంగానే లేవే. వెంకటస్వామి తొత్తు కొడుకు లాగేసుకున్నాడు కాదేటి.

అవున్రా. నిన్న పొద్దుటేల నా దగ్గర కూడా నాగేసుకున్నాడు నంజి కొడుకు. ఏందయ్యా అంటే కర్రపెట్టి పీకుతాడు. ఈడి జిమ్మడిపోను- నర్సింలు గాడి తిట్ల దండకం.

వెంకటస్వామి. స్టేషన్ నమ్ముకున్న ఓ 'కాకీ'. అక్కడ వుండే ప్లాట్‌ఫాంగాళ్ల నోళ్లు కొట్టడం, కేసులు లేకపోతే ఏదో కేసులో ఇరికించడం, ఇల్లు విడిచి వచ్చిన అమాయకపు ఆడపిల్లల్ని రంగమ్మ కంపెనీకి అమ్మేయడం, పిల్లల చేత చెప్పులు దొంగతనం చేయించి పెద్ద పోస్టాఫీస్ దగ్గర అమ్మించడం చేస్తాడు. ఆదమరచి నిద్రపోయే ప్రయాణీకుల సూట్‌కేసులు దొంగతనం చేయిస్తాడు. ఆ వ్యవస్థలోని కొంతమంది వ్యక్తులకు అతను ప్రతినిధి. వాణ్ణి చూస్తే నారిగాడి బృందానికి హడల్. వాడికి కళ్లకు కనపడనంత దూరంలో వుంటారు.

***

వర్షం బాగా పడుతోంది. తిరుమల నుండి విశాఖ వెళ్లే రైలు నెల్లూరు స్టేషను దాటింది. చింపిరి, నారిగాడు రిజర్వేషన్ బోగీలో గేటు దగ్గర మూలగా కూర్చున్నారు. వెంకటస్వామికి ఆ రోజు గార్డు డ్యూటీ. ఇదే బోగీలో వున్నాడు. చలి వణికించేస్తోంది. వెంకటస్వామి చలికి అప్పటికే రెండు మూడు పెట్టెల సిగరెట్లు ఊదేశాడు. చల్లబడ్డ శరీరానికి ఏదో కావాలి. ఎదురుగా చింపిరి. అస్పష్టంగా కనిపించే మాతృత్వపు గురుతులు. చింపిరిని బలవంతంగా టాయిలెట్‌లోకి లాక్కెళ్లాడు. ఎక్కడో దూరంగా పిడుగు పడ్డ చప్పుడు చింపిరి కేక, రైలు చప్పుడును మింగేసింది.

ఆవేశం చల్లబడ్డ వెంకటస్వామి మొఖం తుడుచుకుంటూ బయటకు వచ్చాడు. ఎదురుగా ఎర్రబడ్డ కళ్లతో నారిగాడు... రైలు విజయవాడలో ఆగింది.

వెంకటస్వామి డ్యూటీ అక్కడితో ముగుస్తుంది. రైలు దిగాడు. చేతిలో ఎవరిదో సూట్‌కేస్. రైలు పెట్టెలోంచి ఎవరో అరుస్తున్నారు నా సూట్‌కేస్... నా సూట్‌కేస్... అంటూ! ఏదో నిర్ణయించుకున్న నారిగాడు పరిగెత్తుకుంటూ రైల్వే ఎస్.పి. దగ్గరకు పరిగెత్తాడు నిజం చెప్పటానికి.

నారిగాడు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ఆధారంగా వెంకటస్వామి దొంగసొత్తుతో దొరికిపోయాడు. విచారణలో చింపిరికి చేసిన అన్యాయం బయటపడింది. అతడు చేసిన నేరాలకుగాను కోర్టు అతనికి 10 సంవత్సరాల శిక్ష విధించింది.

***

ఇప్పుడు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఓ కొత్త వ్యక్తి చేరాడు. చింపిరి, నారిగాడుల కొడుకు వెంకటేశం. వాడికి అప్పుడే చీపురు పట్టుకోవడం కూడా వచ్చేసింది. ❑

# ఏకాంత ఖేదం

ఎండ, వాన
చీకటి, వెలుగు
గాలి, నీరు
అన్నీ ఆకాశం నుంచే
ఎన్ని యుగాలుగానో ఆకాశాన్ని తవ్వుతూనే వున్నా
మంచు తరగలు, మబ్బు తునకలే అందుతున్నాయి
మనస్సులోని యుద్ధాలతో
ఏకాంత ఖేదంలో ప్రతి కోరిక చనిపోతున్నది
నెలవులు తప్పి స్థలభ్రంశమౌతామని
యజ్ఞ జ్వాలల నేతి వాసనల కోసం
అందరు దేవతలు హడావుడిగా వున్నారు
ఆత్మ నగరంలో
మనిషి నీడలు పడగలై ప్రతిబింబిస్తున్నాయి
ప్రతివారి తలలు బైటికి కనిపించని సమాధులు
మరణం లేని జీవి జననంతో
యముని మహిష గంటలు
మౌన ముద్రిత కంఠాభరణాలైనాయి
నెత్తిమీద
దరిద్రం
ప్రచండ తాండవ బ్రహ్మాండ పాదమై
నృత్యం చేస్తున్నది
అయినప్పటికీ
దివసావసాన సమయంలో
కామదహనం మంటల కెంపులు
నా చుట్టూ విషాదానలం
ప్రతివాడు
సమస్యల బండరాళ్లకు
తలను బాదుకునే సముద్రుడైనాడు.

*– డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి.*